## క్లుప్తంగా

### విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

**కడప ఎడ్యుకేషన్ :** ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రతి విద్యార్థి వివరాలను తాము చదివే పాఠశాల, కళాశాలల్లో ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలని కడప మండల విద్యాశాఖ అధికారులు దిద్దుకుంట గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఆయా యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్లో నమోదు కానట్లయితే స్టడీ సర్టిఫికెట్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ) మొదలగు ఇతర సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వం నుంచి అందించే ఏ పథకాలకు అర్హులు కారన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యారా లేదా అనేది పాఠశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకోవాలని వివరించారు.

### ఫిజిక్స్‌లో డాక్టరేట్


కాశీరెడ్డి

**వైవీయూ :** యోగివేమన విశ్వవిద్యాలయం ఫిజిక్స్ శాఖ పరిశోధకులు ఎ.సి. కాశీరెడ్డికి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ వై.పి.వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ థర్డ్ జనరేషన్ సోలార్ సెల్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్లాటినం ఫ్రీ అండ్ కాస్ట్ ఎఫెక్టివ్ కౌంటర్ ఎలక్ట్రోడ్స్ ఫర్ డిసెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కాశిరెడ్డి రాసిన పరిశోధన వ్యాసాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

### బీసీ భవన్ అందుబాటులోకి తేవాలి

**కడప సెవెన్‌రోడ్స్ :** కడప పాత రిమ్స్‌లో నిర్మించిన బీసీ భవనాన్ని బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కలెక్టర్ శివశంకర్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక బీసీ భవనాన్ని నిర్మించాలన్న లక్ష్యంలో భాగంగా కడపలో కూడా భవనాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అయితే భవనాన్ని నిర్మించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఇప్పటి వరకు దాన్ని బీసీ సంక్షేమ శాఖకు అప్పగించకపోవడం వల్ల వినియోగంలోకి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ నుంచి బీసీ సంక్షేమ శాఖకు భవనాన్ని బదిలీ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

### 22న పుస్తకావిష్కరణ సభ

**కడప కల్చరల్ :** కడప నగరానికి చెందిన విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు కైపా కుమారస్వామి రచించిన అక్షర సంవేదన కావ్య ఆవిష్కరణ సభను సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని రచయిత తెలిపారు. స్థానిక చెన్నూరు బస్టాండులోని రామకృష్ణమఠంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.గోపినాథ్ సభకు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ ఆడిటర్ జీవీ శివరావు ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని వివరించారు. పుస్తక సమీక్షకులుగా సాహితీ పరిశోధకులు డాక్టర్ పాణ్యం శ్రీనివాసశర్మ, గౌరవ అతిథులుగా విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ పాలెం వేణుగోపాల్, సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి పాల్గొంటారని ఆయన తెలిపారు.

### నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


ఎంపికైన విద్యార్థులతో ఏజీఎం, ఆర్ఐ, సిబ్బంది

**కడప ఎడ్యుకేషన్ :** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం చెన్నకేశవరాజు పేర్కొన్నారు. నగర శివారులోని దుర్గమ్మ గుడి వద్ద ఉన్న నారాయణ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించి పదవుల అప్పగింత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన విద్యార్థులు నిర్వహించాల్సిన బాధ్యతలు, కర్తవ్యాలను తెలిపారు. ఆర్ఐ రామక్రిష్ణ మాట్లాడుతూ లీడర్‌గా ఎంపికైన విద్యార్థులు విద్యార్థులందరిని ఒక తాటిపై నడిచేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, కోఆర్డినేటర్ వినోద్, అకడమిక్ డీన్ తాజాద్దీన్, ఏఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జీవన భృతి పెంపునకు కృషి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల పరిస్థితిని గుర్తించి వారి జీవన భృతి పెంపు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ కడప రీజినల్ సెక్రటరీ రఘునాథరెడ్డి ఇతర రిటైర్డ్ కార్మికులతో కలిసి ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

# శకం శిథిలం.. శకలం ఓ జ్ఞాపకం

● జుమ్మా మసీదు అజా ఘర్

**కడప కల్చరల్ :** వైవీ స్ట్రీట్‌లోని జుమ్మా మసీదు ప్రత్యేకత నగర వాసులందరికీ తెలిసిందే. జిల్లాకు సంబంధించి చారిత్రక విశేషాలలో ఈ మసీదు చోటుచేసుకుంది. నగరంలో అత్యంత ప్రముఖమైన మసీదులలో ఇది అత్యంత ప్రాధాన్యతగలదిగా పేరు గాంచింది. నగరం ఏర్పడిన తొలి నాళ్లలో ఈ ప్రాంతపు ముస్లింలు తమకు ప్రార్థనలు చేసుకునేందుకు వైవీ స్ట్రీట్‌లోని ఈ ప్రాంతంలో చిన్నపాటి మసీదు ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో నగరంతోపాటు వైవీ స్ట్రీట్ కూడా పెరిగింది. దాంతో పాటు జుమ్మా మసీదు కూడా అంచెలంచెలుగా ప్రజల ప్రార్థనలకు అనుకూలంగా అభివృద్ధి చెందింది.

వైవీ స్ట్రీట్‌లోని జుమ్మా మసీదు చారిత్రాత్మకమైనది. ఈ వీధి ప్రారంభంలో ఒకప్పుడు కడప నవాబులు కోటను ఏర్పాటు చేసుకుని నివసించే వారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆ వైభవ ప్రాభవాలు కనుమరుగై పోయాక ఆ శిథిలాలు తీపి జ్ఞాపకాలుగా నేటికీ నిలిచి ఉన్నాయి. కాలాన్ని బట్టి పలు మార్పులు చేస్తూ వచ్చినా కొన్ని కట్టడాలను మాత్రం మార్పు చేయకుండా మధురమైన జ్ఞాపకంగా అలాగే కాపాడుకుంటూ వస్తున్నారు. అందులో జుమ్మా మసీదు కూడా ఒకటి. నిజానికి ఇటీవలే జుమ్మా మసీదును భక్తుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు.


జుమ్మా మసీదులోని అజాన్ ఘర్

అయినా అందులోని 'అజా ఘర్'(ప్రార్థనలకు పిలుపు)ను మాత్రం మార్చలేదు.

**ప్రార్థనకు పిలుపు**

ఒకప్పుడు ప్రార్థనలకు మసీదులకు రావాలంటూ గుర్తు చేస్తూ మౌజన్ ఆ ప్రాంత వాసులకు పిలుపు నిచ్చేవారు. కొద్దిగా ఎత్తయిన ప్రాంతంపైకి వెళ్లి అక్కడి నుంచి వీలైనంత ఎక్కువ మందికి వినిపించేలా ప్రార్థనలకు రావాలని పిలిచేవారు. భక్తులు ఆ పిలుపు ప్రకారం మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేసేవారు. వేళ అయిందని ప్రార్థనలకు రావాలని ఆ ప్రాంత వాసులకు పిలుపును అందించేందుకు మసీదులు నిర్మించేటపుడు కొద్దిగా ఎత్తయిన ప్రాంతంలో చిన్న గదిని నిర్మించేవారు. దాన్ని ఎంతో పవిత్రంగా నగిషి పనులతో అత్యంత ఆకర్షణగా తీర్చిదిద్దేవారు. అజాన్ ఇచ్చేటపుడు మౌజన్ ఎంతో పవిత్రంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించేవారు.

**మరువలేని జ్ఞాపకం**

జుమ్మా మసీదులోని ఈ అజాన్ ఘర్ నేడు మరువలేని మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది. ఆధునీకరణలో భాగంగా మసీదులో పలు మార్పులు చేశారు. అయినా అజాన్ ఘర్ మాత్రం వైవీస్ట్రీట్ మధ్యలో ఉత్తర దిశగా గంబీరంగా నేటికీ ప్రార్థనలకు రమ్మంటూ పిలిచినట్లే నిలిచి ఉంది. దాన్ని ప్రత్యేకించి చూసిన వారికి అందులో కొయ్యపై చూపిన నగిషి పనితనం కనిపిస్తుంది. మొత్తంపై ఎన్ని రకాల ఒడిదుడుకులకు, మార్పులకు గురైనా కూడా అజాన్ ఘర్ తన పవిత్రత, గంబీరతను, మినార్‌లాగా అందరి దృష్టి ఆకర్షిస్తూ కడప నగరానికి ఘనమైన వారసత్వ సంపదగా నిలిచి ఉంది.


**జిల్లాకు అద్భుతమైన వరం**



ఈ కట్టడం జిల్లాకు అద్భుమైన వరం లాంటిది. దాదాపు 300 ఏళ్ల క్రితం నాటి ఘనమైన వారసత్వ సంపదను నేటి తరాలకు అందించడం గొప్ప విషయం. నాటి నిర్మాణ శైలి, పటిష్టత వందల సంవత్సరాలను దాటుకుని నేటికీ జిల్లా ఘనతను చాటుతూ ఉండడం నిజంగా ఆశ్చర్యం గొలిపే విషయం.

- సయ్యద్ సలావుద్దీన్, సంఘ సేవకుడు, కడప

**విలువైన వారసత్వ సంపద**



జిల్లాలో కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో జుమ్మా మసీదుకు గొప్ప పేరుంది. నగరంలో ఖిల్లా మసీదు తర్వాత ఈ మసీదునే నిర్మించారు. అందుకు బలమైన సాక్ష్యంగా ఈ కట్టడం కనిపిస్తోంది. నేటి తరాలకు నాటి భవనాల నిర్మాణం గురించి తెలుసుకునేందుకు ఇంతకంటే మంచి అవకాశం లేదు. ఇది జిల్లాకు గర్వకారణం.

- దస్తగిరి, రాష్ట్ర అధ్యక్షులు, మైనార్టీ రైట్స్ ఫోరం, కడప

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టకపోతే ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పు ప్రభావం వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదన్నారు. చిన్నపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలు జలమయమై మురికి నీరు బయటకు పోయే మార్గాలు మూసుకుపోవడం వల్ల దోమలకు నిలయాలయ్యాయని పేర్కొన్నారు. డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరిగి సామాన్య పేద మధ్యతరగతి కుటుంబాలు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షాలు, లీకేజీల వల్ల డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నీరు కలుషితమై డయేరియా బారినపడి జిల్లాలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రజలు వ్యాధులకు గురైనప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందుబాటులో లేకపోతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురై అనివార్యంగా అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. తక్షణం వైద్య ఆరోగ్యశాఖ, ప్రజా ఆరోగ్య శాఖ, పారిశుద్ధ్యం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డయేరియాతో చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. చంద్రశేఖర్, పి.సుబ్బరాయుడు, డీహెచ్‌పీఎస్ కార్యదర్శి కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమయస్ఫూర్తితో వ్యవహరించాలి


మాట్లాడుతున్న లీడర్ ఆఫ్ కోర్సు వెంకటేశ్వర్లు


కార్యక్రమంలో పాల్గొన్న స్కౌట్ మాస్టర్లు


**కడప స్పోర్ట్స్:** అత్యవసర సమయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సమయస్ఫూర్తితో వ్యవహరించాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ ఆఫ్ కోర్సు వెంకటేశ్వర్లు సూచించారు. కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న 7 రోజుల బేసిక్ శిక్షణ కార్యక్రమంలో రెండో రోజు శనివారం టెంట్‌ల నిర్మాణం, జెండా ఆవిష్కరణ, ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ప్రమీల మాట్లాడుతూ 7 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కౌట్ అధికారులు, మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదాతను అభినందిస్తున్న డీఆర్‌ఓ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

**కడప స్పోర్ట్స్ :** యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలో వివిధ స్వచ్ఛందసేవాసంస్థలు, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు జీబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఆర్‌ఓ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కృత్రిమంగా తయారు చేయలేమని, రక్తదాతల ద్వారానే వస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువత రక్తదానం చేయడం ద్వారా రక్తనిల్వలు పెరుగుతాయన్నారు. సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో రక్తం కొరతను అధిగమించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త మణికంఠ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందసేవాసంస్థలు కలిసి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసమితి అధ్యక్షుడు అశోక్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కృషి


మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న సీఐ సి.భాస్కర్‌రెడ్డి

**కడప అర్బన్ :** కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రతి మహిళా సంరక్షణ కార్యదర్శి కృషి చేయాలని కడప వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి తెలియజేయాలన్నారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన నేరాల నియంత్రణకు తమ వంతుగా సమాచారాన్ని అందించాలన్నారు. నేరాలు జరిగిన తరువాత దర్యాప్తులో తమవంతుగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయినాథుని గ్రామోత్సవం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** మండల పరిధి దొరసానిపల్లెలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయిబాబా ఉత్సవ మూర్తిని వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

### వైవీయూ వీసీని కలిసిన నాయకులు

**వైవీయూ :** యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.కృష్ణారెడ్డిని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన దృష్టికి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్‌కుమార్‌రెడ్డి, వైవీయూ నాయకులు భరత్, అమృత్, అశోక్, హనీష్, జయదేవ్, రంజిత్, రాజేష్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

● కడప శాసన సభ్యురాలు ఆర్.మాధవిరెడ్డి, కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిలను యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైవీయూ అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు.

### నేడు గురుపౌర్ణమి వేడుకలు

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** నగర శివార్లలోని 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు గ్రామంలోని శుభసాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతోపాటు పలు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కమలాపురం :** పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో వెలసిన అనాథ బాలుర ఛాత్రాలయంలో యోగా గురువు శ్రీ అనపాటి నాగరాజు శిష్యుల ఆధ్వర్యంలో ఆదివారం గురు పౌర్ణమి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## గండి ఉత్సవాలకు సహకారమివ్వండి

**చక్రాయపేట :** అన్ని శాఖలకు చెందిన అధికారులు సహకారమిస్తే గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రణాళికా బద్ధంగా ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం గండిక్షేత్రంలోని ఆలయ కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గండిలో రాజగోపురం నిర్మాణం సందర్భంగా రోడ్డుపై గుంతను తవ్వినందున వాహనాలు ఒకవైపునే వెళుతున్నాయని దీంతో ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రావణ మాసంలో వచ్చే ప్రతి శనివారం వాహణాలను అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్ వద్దనే ఆపేస్తామన్నారు. గతంలో చివరి రెండు వారాలు మాత్రమే ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవని ఈసారి అన్ని వారాలు ఆంక్షలు ఉంటాయన్నారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. చక్రాయపేట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ తరపున ఉత్సవాల గోడపత్రికలను ఉచితంగా అచ్చు వేయించి ఇస్తామని బ్యాంక్ మేనేజర్ భానుచందర్ తెలిపారు. అలాగే ఉత్సవాల్లో టికెట్ కౌంటర్లు, లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయ కౌంటర్లను కూడా తమ బ్యాంకు ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు వైద్యసేవలు అందేలా చూస్తామని చక్రాయపేట వైద్యాధికారిణి వాణి తెలిపారు. అలాగే విద్యుత్, నీటిసమస్య, బారికేడ్లు, క్యూలైన్లు, దుకాణాల నిర్వహణ, అలంకరణ, రవాణా సౌకర్యాలు, అగ్నిమాపక శాఖ తదితరాలపై చర్చించారు. అనంతరం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అందరూ సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, ఎంపీడీవో సోమశేఖర్, ట్రాన్స్‌కో, ఆర్టీసి, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అత్యాచారాలు చేసే వారిని శిక్షించాలి

**జమ్మలమడుగు :** మహిళలు, బాలికలపై అత్యాచారాలు చేసేవారిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కాలేజి విద్యార్థులతో కలిసి వారు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ముచ్చుమర్రి స్రవంతి అనే చిన్నారిపై అత్యాచారం చేసి చంపినందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోతన్నాయన్నారు. ప్రభుత్వం కాలేజీ, పాఠశాలల్లో విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని నింపడంకోసం వారికి కరాటే, టైక్వాండో క్లాసులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### యువతకు సాధికారత అందించటమే లక్ష్యం

**జమ్మలమడుగు రూరల్ :** సమగ్ర విద్య, వృత్తి శిక్షణ ద్వారా యువతకు సాధికారత అందించటమే లక్ష్యమని దాల్మియా సిమెంట్ యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా తెలిపారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ సునీల్‌కుమార్, దాల్మియా హెచ్‌ఆర్ హెడ్ ఉమేష్ కోల్హట్కర్, హెచ్‌ఆర్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ మాన్‌సూన్ మ్యాజిక్ వినియోగించుకోవాలి


హౌసింగ్ మేళాను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

**కడప రూరల్ :** ప్రజల సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాన్‌సూన్ మ్యాజిక్ పేరుతో అందజేస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్‌కుమార్, ఏజీఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలో ఎస్‌బీఐ హౌసింగ్ లోన్ మేళా ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న హౌసింగ్ మేళా ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు కొనసాగే ఈ మేళాలో రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రద్దు చేశామన్నారు. ప్రజల అవసరాల మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల నిర్మాణానికే సంబంధించి కాకుండా ఇళ్ల కొనుగోలుకు కూడా తమ బ్యాంకు ప్రజలకు తోడ్పాటు అందిస్తోందన్నారు. ఇంటి డాక్యుమెంటేషన్‌ను అందజేస్తే అన్ని పనులు పూర్తి చేసి, ఏడు రోజుల్లో ప్రక్రియ ముగించేలా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అంతేకాకుండా తమ బ్యాంకు విద్య, వ్యాపార రుణాలను సైతం తక్కువ వడ్డీ రేటుతో అందజేయడం జరుగుతోందన్నారు. స్థానికంగానే కాకుండా ఇతర నగరాల్లో సైతం ఇళ్ల కొనుగోలు చేయదలుకుంటే అందుకు సంబంధించిన పనులను కూడా తామే పూర్తి చేసి రుణ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇళ్ల కొనుగోలు, నిర్మాణదారులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారి సురేష్‌బాబుతోపాటు నగర ప్రముఖులు, బిల్డర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్ర విజ్ఞానంపై అవగాహన అవసరం


విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ ప్రతినిధులు

**కడప కల్చరల్ :** శాస్త్రవిజ్ఞానం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక నాయకులు కామేశ్వరమ్మ అన్నారు. శనివారం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని తేజ స్కూలులో సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్ తదితర అంశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో సృజన శక్తిని పెంచేందుకు మూఢ నమ్మకాలను దూరం చేసేందుకు ఆమె పలు ఉదాహరణలతో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. మ్యాజిక్ తదితరాలను నిజమని నమ్మకూడదని, అంతా హస్త లాఘవమేతప్ప అద్భుతాలు, మహిమలు ఉండవన్నారు. ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో చూసి వాస్తవాలు గురించి తెలుసుకోవాలని సంస్థ నాయకులు అరుణ తెలిపారు. కార్యక్రమంలో సునీత, నిర్మల, ప్రధాన కార్యదర్శి బాల బయన్న, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, తేజ స్కూలు కరస్పాండెంట్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా భవాణి పీరు ఉత్సవం

**పులివెందుల టౌన్ :** పట్టణంలో భవాణీ పీరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని పీర్ల చావిడిలో అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామోత్స వం నిర్వహించారు. భక్తులు చెక్కర చదివింపు లు ఇచ్చారు. భక్తులు వెండిగొడుగులు చేయించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మెయిన్ బ జార్, శ్రీరామాహాల్ రోడ్డు, మారుతిహాల్ రో డ్, తదితర ప్రాంతాల్లో పీర్ల ఉత్సవం జరిగింది.

### ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కమలాపురం :** ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షేక్‌ఇమ్రాన్ తెలిపారు. శనివారం కమిషనర్, యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ పర్యవేక్షణలో స్థానిక ఎం.జే.పీ. బీసీ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ తరుణంలో రాణించాలంటే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీతో పాటు సాంకేతిక నైపుణ్య కోర్సులను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. సివిల్స్ సాధించాలి అనుకుంటే సరిపోదని, దానిని సాధించడానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. వాటి సాధనలో మీకు ముందు తరగతుల్లో బోధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు ఇప్పటికే ఉన్నత స్థానాలను అధిరోహించిన వారి సలహాలు, సూచనలు తీసుకుని వాటిని పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం నాగిరెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

### 24న ఆలయ భూముల వేలం

**రాజుపాళెం :** కొర్రపాడు గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర దేవస్థానాలకు సంబంధించిన భూములను 24వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కౌలుకు వేలంపాట వేయనున్నట్లు ఆలయ ఈఓ కె.రామచంద్రాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 21.46 ఎకరాల భూములకు వేలంపాట జరగనుందని చెప్పారు.